క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



ఆంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట : మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోమం వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి లభిస్తుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరణ



జాతీయ మహాసభల కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్మికులు

మహారాణిపేట : ఆల్ ఇండియా కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 4వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులు కోరారు. సోమవారం కురుపాం మార్కెట్ వద్ద మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈనెల 8,9 తేదీల్లో కన్యాకుమారిలో ఈ మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. వేతనాలు రెట్టింపు చేయాలని, కార్మికులందరికి పీఎఫ్, పెన్షన్, ఉచిత విద్య, ఆరోగ్య సేవలు, 8 గంటల పని దినం, అదనపు పనికి డబుల్ ఓటీ ఇవ్వాలని యూనియన్ కార్యదర్శి జి.జానకీరావు కోరారు.

సతకంపట్టుకు చేరిన పుట్టబంగారం



అమ్మవారి పుట్ట బంగారం తీసుకు వచ్చేందుకు వెళ్తున్న భక్తులు

అల్లిపురం : రాచపోలమాంబ ఉత్సవాలు గత నెల 20వ తేదీ నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సోమవారం అమ్మవారి పుట్టబంగారం తీసుకువచ్చే కార్యక్రమం నిర్వహించారు. కుమ్మరవీధిలో అమ్మవారి పెద్దింటి నుంచి అమ్మవారిని తప్పిటగుళ్లు, సాంప్రదాయ డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య రైల్వే క్వార్టర్స్‌లో గల రామాలయం దరి పుట్ట వద్దకు వెళ్లి పుట్టబంగారాన్ని అమ్మవారి సతకం పట్టు వరకు తీసుకువచ్చి నిలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

నియోజకవర్గ పరిధిలో గల పలు బాబా ఆలయాల్లో గురుపూర్ణిమ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలు ఆలయాల్లో అన్నాభిషేకం నిర్వహించారు.



సింగ్ హోటల్ జంక్షన్‌లోని ఓం సాయిబాబా ఆలయంలో బాబాకు అన్నాభిషేకం

- సాయినామ స్మరణతో మార్మోగిన ఆలయాలు
- బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు



నారాయణసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

దాబాగార్డెన్స్ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని సింగ్‌హోటల్ జంక్షన్‌లో వెలసిన శ్రీగణేష్ పార్వతీ సమేత ఓంకార శివాలయం, ఓంసాయిబాబా ఆలయంలో కమిటీ ప్రతినిధులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వడ్ల రామారావు, వడ్ల కృష్ణారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

జీవీఎంసీ 29వ వార్డు రామజోగిపేటలో గురుపౌర్ణమి సందర్భంగా వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఏర్పాటు చేసిన సాయిబాబా పూజా కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్, పలువురు ప్రముఖులు పాల్గొని బాబాకు పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. వన్‌టౌన్‌లో గల పలు బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. బురుజుపేట సాయిబాబా మందిరంలో తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, విభూది అభిషేకం, క్షీరాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు నక్షత్ర హారతి, చంద్ర హారతి దివ్యజోతులతో నీరాజనం, సాయంత్రం పల్లకి సేవ, శోభాయాత్ర జరిపారు. ఆలయ వ్యవస్థాపకుడు కందర్ప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దండుబజారు డౌన్ రోడ్డులో గల సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. 29వ వార్డు రామజోగిపేట సర్వమత సాయిరామ్ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు. సర్వమత శ్రీసాయిరామ్ మందిర్ మహిళా మండలి వ్యవస్థాపకుడు వియ్యపు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఇసుకకొండ సత్యనారాయణస్వామిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుద్ద నాగ జగదీష్, కనకమహాలక్ష్మి దేవస్థానం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు విశేష అభిషేకాలు.. ప్రత్యేక హారతులు

అల్లిపురం : సోమవారం వాడవాడలా సాయిబాబా దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అచ్చియ్యమ్మపేటలో వెలసిన షిర్డీ సాయి ధ్యాన మందిరంతో పాటు కుమ్మరవీధిలో గల సాయిబాబా దేవాలయం, సాయిబాబా వీధిలో వెలసిన సాయిబాబా ఆలయంతో పాటు 32, 33, 34 వార్డుల్లో గల సాయిబాబా దేవాలయాల్లో తెల్లవారు జాము నుంచి విశేష అభిషేకాలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట దేవాలయంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, లండా రమణ, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు తదితరులు పాల్గొని పూజలు చేశారు. వారికి ఆలయ ఫౌండర్ ఉమ్మిడి నాగరాజు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి బాబా శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు పంపిణీ చేశారు. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన సాయిబాబాకు ఆలయ అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో కుంబాభిషేకం, విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయిబాబా వీధిలో వెలసిన సాయిబాబా దేవాలయంలో పీల వెంకట అప్పలనాయుడు, బొడ్డు పోలరావు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త పీల వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొని అన్నదానం చేపట్టారు. బంగారుమెట్టలో వెలసిన సాయి దర్బార్‌లో సాయిబాబాకు విశేష పూజలు, సాయి వ్రతాలు చేపట్టారు. మధ్యాహ్నం నారాయణసేవ నిర్వహించారు.



శివరామకృష్ణ దేవస్థానంలో పూజలందుకుంటున్న సాయిబాబా

35వ వార్డులో..

జగదాంబ : గురుపౌర్ణమిని పురస్కరించుకుని జీవీఎంసీ 35వ వార్డులో సాయిబాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బాబా ఆశీర్వాదాలు అందరికీ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మంగరాజు, యల్ల రామయమ్మ, రామాలయం సాయిబాబా కమిటీ మెంబర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

మహారాణిపేట : కలెక్టరేట్ జంక్షన్‌లోని షిర్డీ సాయిబాబా లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ సహకారంతో సోమవారం అన్నదానం జరిగింది. 29వ వార్డు కార్పొరేటర్ వురికిటి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 1500 మందికి పైగా ప్రజలకు అన్నప్రసాద వితరణ చేశారు. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ దక్షిణ ప్రాంత సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్ హాజరయ్యారు. ఇటువంటి దైవ కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వార్డు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సీతంరాజు సుధాకర్



బాబాకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

అమ్మఒడితో ఉజ్వల భవిత



గౌరీవీధి సచివాలయంలో జగనన్నకు కృతజ్ఞతలు చెబుతున్న లబ్ధిదారులు

అల్లిపురం : జగనన్న అమ్మఒడితో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ అన్నారు. సోమవారం ఆయన గౌరీవీధి సచివాలయం పరిధిలో అమ్మఒడి లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి ద్వారా విద్యార్థులు ఇంటర్ వరకు చదువుకునే అవకాశం ఉందన్నారు. ఒక్క గౌరీవీధి సచివాలయం పరిధిలోనే 314 మంది లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో భీశెట్టి రాజు, సచివాలయ అడ్మిన్ పీవీ కిరణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట : సోమవారం కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎల్ఏఆర్ ఆంజనేయులు, సభ్యులు డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పించారు. 1964 సహకార చట్టానికి చేసిన సవరణలు రద్దు చేయాలని, కొత్త వేతనాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీని చట్ట ప్రకారం అమలు చేయాలని, రాష్ట్ర సహకార బ్యాంక్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కలిసి డిస్ట్రిక్ట్ లెవల్ సపోర్ట్ ఫండ్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో.. అందరికీ మేలు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరి మోములో చిరునవ్వులు చూస్తున్నామని లబ్ధిదారులు తెలిపారు. 42వ వార్డు ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధి రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ, కేఎస్ఎం బాలికల హైస్కూళ్ల ప్రాంగణంలో సోమవారం స్థానిక కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపలి గణేష్‌కుమార్, ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, జీవీఎంసీ జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ త్రినాథరావు పాల్గొన్నారు. జగనన్న సురక్ష సర్వేలో భాగంగా వచ్చిన సుమారు 649 వినతులకు గాను 578 సర్టిఫికెట్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి బాబూరావు, ఏపీడీ పద్మావతి, మాజీ కార్పొరేటర్, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ ఎ. సూరిబాబు, డైరెక్టర్లు ఎస్. ప్రసాదరావు, మాధవి, మధు, వార్డు సీనియర్ నాయకులు, సెక్రటరీలు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ తాను గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పని చేసానని, ఆనాడు పథకాలు ఉన్నా లబ్ధిదారులకు అందేవి కాదన్నారు. పథకాలను ఏ విధంగా తగ్గించాలో చూసేవారని తెలిపారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చివరి లబ్ధిదారుడి వరకు పథకాలు అందజేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అద్భుత పాలన సాగిస్తున్న జగనన్నకు అందరూ సంపూర్ణ మద్దతునిచ్చి 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి పని చేస్తున్నారని అన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

కాళ్లరిగేలా తిరిగే పని తప్పింది



గతంలో ఇటువంటి ధ్రువీపత్రాల కోసం ఎమ్మార్వో, ఇతర కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే వాళ్లం. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎటువంటి ప్రయాస లేకుండా ఒకేసారి కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందుకున్నాను. వలంటీర్ ఇంటికి వచ్చి సేవలందించడం ఆనందంగా ఉంది.

– షేక్ హసీనా బేగం, రైల్వే న్యూకాలనీ

సులువుగా కుల ధ్రువపత్రం పొందాను



గతంలో సర్టిఫికెట్లు పొందాలంటే చాలా రోజులు వేచి చూడటం, కార్యాలయాల చుట్టూ తిరగడం, దళారులను ఆశ్రయించడం జరిగేది. నేడు వలంటీర్లు ఇంటికే వచ్చి అవసరమైన సేవల కోసం దరఖాస్తు చేసి అధికారుల ద్వారా మంజూరు చేయించి మా చేతికే అందిచడం చాలా బాగుంది. వైఎస్సార్‌సీప ప్రభుత్వం హయాంలో కేవలం మూడు రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రం పొందడం ఆనందంగా ఉంది.

– ఉప్పాడ రాము, రైల్వే న్యూకాలనీ

శాకంబరిగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



శాకంబరిగా దర్శనమిచ్చిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారు

అల్లిపురం : ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా అస్సాంగార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారు సోమవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జాము నుంచి ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ఆకుకూరలు, కాయగూరలు, పనస పండ్లు, పైనాపిల్ పండ్లు, మామిడి పండ్లతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో పాటు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి శాఖాన్నం ప్రత్యేక ప్రసాదంగా భక్తులకు అందజేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ అమ్మవారు నగర ప్రజలను శుభిక్షింగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీకాంతం, చంద్రకళ, గంగ, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్‌జైన్, జేసీజే ఇన్‌చార్జ్ కర్రి సీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, మాదాబత్తుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలి

దాబాగార్డెన్స్: విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపా ధనుంజయ్, ఉపాధ్యక్షుడు బైటింటి మీనాక్షిరెడ్డి, దారపు ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో నటీనటులు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పనిచేస్తోందన్నారు. అసోసియేషన్ సభ్యులందరికీ పని కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, సొంత గృహాల సాధన కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టాలీవుడ్ పెద్దలు చర్చలు జరిపి చిత్ర పరిశ్రమపై ఆధారపడిన వారిని ఆదుకోవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి శిల్లా సుజాత, గంధం విజయరమణి, నిర్మలభాను, రెడ్డిపల్లి పూజాకుమారి, డి.ప్రసాదరెడ్డి, మత్తి రత్నకుమార్, తలారి సురేష్, కందగాయత్రి, గొందేశి రమణారెడ్డి, భరత్, మాసవరపు శ్రీనివాస్, ఏలూరు లక్ష్మి, దున్నా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధనుంజయ్

శరవేగంగా వన్‌టౌన్ విస్తరణ పనులు



పూర్ణామార్కెట్ వద్ద తొలగించిన అనధికార కట్టడాలు

జగదాంబ : పాతనగరం విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే భవన యాజమానులు వారి డాక్యుమెంట్లు అందజేయాలని జీవీఎంసీ కోరింది. అయితే కొందరు మాత్రమే పత్రాలు ఇచ్చారు. మిగతా వారు నిరాకరించడంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎవరికి ఎంత వరకు హద్దులు ఉన్నాయో గుర్తించారు. దీంతో 95 శాతం అందరు ఆక్రమణలో ఉన్నట్లు మ్యాప్ ద్వారా గుర్తించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగిస్తున్నారు. జగదాంబ జంక్షన్ నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు జరుగుతున్న రహదారి వెడల్పు పనుల్లో ఇప్పటికి 25 శాతం వరకు ఆక్రమణలు తొలగించారు. ఈ నెలాఖరు నాటికి పూర్తిగా ఆక్రమణలు తొలగించి రహదారి 60 అడుగులకు విస్తరిస్తామని జీవీఎంసీ జోన్–4 టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు.

అర్హులకు టీడీఆర్‌లు..



వాస్తంగా సరిహద్దుల్లో ఉన్న అర్హులు డాక్యుమెంట్లు అందజేస్తే వారికి టీడీఆర్‌లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. మ్యాప్ ద్వారా పరిశీలించి ఆక్రమించుకుని ఉన్న వారికి ముందుగా నోటీసులు ఇచ్చాం. స్పందించని వారి కట్టడాలను సిబ్బందితో తొలగిస్తున్నాం.

–వినయ్‌ప్రసాద్, ఏసీసీ, జీవీఎంసీ జోన్–4.

కాలుష్య నియంత్రణకు సహకరించండి

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు, పర్యావరణ పరిరక్షణకు అందరి సహకారం అవసరమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, నగర ప్రజలు, వివిధ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యం తదితరులు కాలుష్య నియంత్రణకు సహకరించి, వారంలో ఒక్కరోజు ప్రజారవాణాను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు ప్రతి సోమవారం తనతో పాటు జీవీఎంసీ ఉద్యోగులు తమ వాహనాలు వదిలి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని తెలిపారు.



సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకుంటున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

కిటకిటలాడిన కేజీహెచ్



మహారాణిపేట : సోమవారం ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ రోగులు, భక్తులతో కిటకిటలాడింది. సాధారణంగానే ప్రతిరోజూ రోగులు, వారి సహాయకులతో రద్దీగా ఉండే కేజీహెచ్ గురుపౌర్ణమి సందర్భంగా ఇసుకకొండ సత్యనారాయణస్వామి దేవాలయానికి వెళ్లే భక్తులతో కిక్కిరిసిపోయింది. రోగులు, భక్తులకు ఒకటే మార్గం కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ కొత్తగా ఓపీ కౌంటర్లు ప్రారంభించినా రద్దీ మాత్రం యథావిధిగానే ఉంది.



రోగులు, వారి బంధువులతో రద్దీగా కేజీహెచ్

న్యాయం కోరుతూ వినతి

దాబాగార్డెన్స్ : విమాన్‌నగర్ వద్ద కంటైనర్ కార్పొరేషన్‌లో హౌస్‌కీపింగ్ స్టాఫ్‌గా గత 15 ఏళ్లుగా పని చేస్తున్న బోడిపల్లి కృష్ణవేణి విధులకు వెళ్తూ.. గత నెల 28న కార్యాలయ సమీపాన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సోమవారం కార్యాలయ అధికారి కేవీఎస్ఆర్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. విధులకు వస్తూ చనిపోయిన కృష్ణవేణి కుటుంబానికి యాజమాన్యం నుంచి రావల్సిన నష్టపరిహారంతో పాటు కుటుంబలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కంటైనర్ కార్పొరేషన్ అధికారి స్పందించి, కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడి, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం

దేవాదాయ ధర్మాదాయ శాఖ, మెయిన్‌రోడ్, విశాఖపట్నం

బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం జిల్లా మరియు నగరం మెయిన్‌రోడ్‌లో వేంచేసియున్న శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు ఈ దిగువ తెలిపిన అంశమును సంబంధించి రెండు సంవత్సరముల కాలంనకు తేది 12-07-2023 ఉదయం 11.00గంలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలంపాట జరుపబడును.

వ.సం	అంశం	ప్రథమ ధరావత్తు	లీజు కాలపరిమితి
1.	శ్రీ స్వామివారికి భక్తులచే సమర్పించబడిన కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకొను హక్కు	రూ.5,000/-	తేది 1-8-2023 నుండి 31-7-2025 వరకు

వేలం పాట షరతులు

1. ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వేలంపాటదారులు వారి యొక్క అడ్రస్ ప్రూఫ్ నిమిత్తం ఓటర్ కార్డు / రేషన్‌కార్డు / ఆధార్‌కార్డు / పాన్ కార్డులలో ఏదైన ఒక జెరాక్సు కాపీ సమర్పించవలెను.

విశాఖపట్నం, తేది : 04-07-2023 — కార్యనిర్వహణాధికారి